# వరపతి



## మినీ కథావీథి

— ఇంద్రగంటి జానకీబాల

వీరయ్య వివరీతమైన పనిలో మునిగిపోయాడు. తలెత్తకుండా చేసినా పని పూర్తి అవుతుందా అనిపిస్తోంది. పాస్ చెయ్యాల్సిన బిల్లులు అతని టేబులుమీద కుప్పలా పడివున్నాయి. డిస్కౌంట్లు, పెనాల్టీలు, డెలివరీ షెడ్యూల్సు– సప్లైస్, రేట్ ఎమెండ్‌మెంట్స్ అంటూ బుర్ర బద్దలు కొట్టుకుంటుంటే ఆఫీసర్‌గారు పిలుస్తున్నారని కబురొచ్చింది.

వీరయ్య పేపర్లు పక్కగాపెట్టి వెళ్ళాడు.

"ఇదిగో యిది అర్జంట్. ఇప్పుడే ఓ అరగంటలో పేమెంట్ యిచ్చెయ్యాలి- వెంటనే పాస్ చెయ్యండి" అంటూ ఆయన నొక బిల్లు యిచ్చారు. అదొక ఆయిల్ కంపెనీ బిల్లు.లక్షా యాభై వేలకి పైనేవుంది. అది స్వయంగా తీసుకొచ్చిన రిప్రజంటేటివ్ కూడా వీరయ్య వెంటవచ్చి అతని సీటుదగ్గర కూర్చున్నాడు.

ఆ ఆయిల్‌బిల్లు చూడగానే వీరయ్యకి యింట్లో కిరసనాయిల్‌లేని విషయం గుర్తుకొచ్చింది. కిరసనాయిల్ వారం రోజులుగా ఊళ్లో దొరకడంలేదు. రోగిష్టి భార్య కుంపటి పెట్టుకొని వదరానిపాట్లు పడుతోంది. పెట్రోల్, డీసిల్ ఆయిల్ సప్లై చేసే ఈ కంపెనీకి కిరసనాయిల్‌తో సంబంధం వుండక పోతుందా? తప్పక వుండే వుంటుంది.

వీరయ్య ఆలోచన కట్టిపెట్టి బిల్లు పాస్ చేసి ఆఫీసరుగారి సంతకం చేయించి, చెక్కు తయారు చెయ్యమని చెప్పివచ్చి, నెమ్మదిగా ఆ రిప్రజంటేటివ్‌ని కదిపాడు. అతను మొదటి మాటలోనే యితని భావం గ్రహించి "మీరు ఫలానా డిపోకి రండి. మీకెంత కిరసనాయిల్ కావలసినా యిప్పిస్తాను" అంటూ ఎడ్రస్ రాసిచ్చి, వీరయ్య పేరు అడిగి అక్కడ చెప్తానని ఎంతో మర్యాదగా చెక్కు తీసుకొని వెళ్ళిపోయాడు.

వీరయ్య ఢిల్లీ సింహాసనం ఎక్కినంత ఆనందపడిపోయి మర్నాడు శలవు పెట్టేశాడు.

నీటుగా తయారై వద్దెనిమిది లీటర్లు పట్టే డబ్బా తీసుకుని, ఊరికి దూరంగా వున్న డిపోకి బయలుదేరాడు.

అక్కడొక పెద్దమనిషి కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు. వీరయ్య వినయంగా వెళ్ళి "మరేమోనండి కిరసనాయిల్" అని మొదలుపెట్టంగానే — ఆ పెద్దమనిషి పేపర్లోంచి తలెత్తి చూడకుండానే "స్టాకు లేదండి" అన్నాడు.

వీరయ్య రెండు నిమిషాలు నిలబడినా అతను పేపర్లోంచి తలెత్తకపోవడంతో వెనక్కి తిరిగాడు వీరయ్య.

ఒక ఫర్లాంగు దూరం వచ్చి అక్కడొక మైలురాయిమీద కూర్చుని తీవ్రంగా ఆలోచించాడు. అతనెంతో నిజాయితీగా చెప్పాడే? అయినా ఇలా అయింది. అయినా తన మాటే వినిపించుకోలేదు. అని యోచిస్తుంటే అతని బుర్రలో తళుక్కున ఒక ఊహ మెదిలింది.

కళ్ళజోడు తీసి జేబులో పెట్టేశాడు. టక్ చేసిన షర్టు పేంటు మీదకి లాగేసుకున్నాడు. జేబులోంచి దువ్వెన తీసి కుడిపాపిడ తీసి క్రాపు మార్చేశాడు. పేంటు కాస్త పైకి మడిచాడు. జేబులోంచి చిన్న కాగితంతీసి దానిమీద తనపేరు,ఆఫీసు రాసి ముందుకు కదిలాడు.

"ఆఫీసునించి ఈరయ్యాగారు వంపారండి" అంటూ కాగితం అయనకిచ్చాడు.

అది చూసి "ఒరే సుబ్బన్నా – కిరసనాయలంత పోసి వంపించు" అని మళ్ళీ పేపర్లో తల దూర్చాడాయన.

అయిదు నిముషాల్లో పని పూర్తి చేసుకుని బయటపడిన వీరయ్య "వరపతి గల వాళ్ళు నౌకర్ని వంపాలిగానీ తనేపోతే పని యెట్లాగౌతుంది ?" అనుకుని చకచకా అడుగులు వేశాడు. ★



కడపలో జరిగిన రాష్ట్ర నాటకోత్సవాల సందర్భంగా శ్రీ పసల సూర్యచంద్రరావును ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ అధ్యక్షులు శ్రీ కె. వి. గోపాలస్వామి నాటక కళా ప్రపూర్ణ బిరుదునిచ్చి సత్కరించినప్పటి దృశ్యం